
# లోకం పోకడ



కథానిక

ఆ మరునాడు వినాయక చవితి. అయిదు గంటల బండిలో మా బావమరది సుందరం దిగాడు. వాల్తేరు పర్ల్లో బి. ఎ ఆనర్స్ మూడో సంవత్సరం వెలగబెడ్తున్నాడు. చిన్నచిన్న పండుగలకు అంటే వినాయక చవితి, దసరా వగైరాలకు మా ఇంటికి రావటం; సంక్రాంతికి, వేసవికి పుట్టింటికి (స్వగ్రామం) కోనసీమ వెళ్లటం వాడికి అలవాటయింది. మాటిమాటికి ఆ రావణాసురుడి లంకలోకి (కోనసీమ) దూకటం అంటే వాడికి పరమచికాకు. ఒక్క విమానయానం మినహా అన్ని యానాలు చెయ్యాల్సిందే ఆ కోనసీమలో కాలుపెట్టాలంటే! రాత్రి ఎనిమిది గంటలకు మెయిలెక్కి పడుకొంటే తెల్లవారేసరికి మూడువందలమైళ్లు సునాయాసంగా దాటి మద్రాసు మహానగరంలో వాలొచ్చు. కానీ ఈ కోనసీమ ప్రయాణానికి ఫక్తు ఒక పగలంతా కావాల్సిందే! ఎటుచూచినా నీళ్లేగామరి!

వాడికి మా వూరు రావటం మహావీలు. చక్కగా మెయిల్ లైనులోవుంది. అక్కడ ఎక్కితే ఇక్కడ దిగటం. వాడు రావటం నాకూ ఇష్టమే, కాలం సరదాగా కబుర్లతో నెట్టెయ్యొచ్చు. కానీ వాడు ఒట్టి చిలిపిరకం. పాతకాలం సంగతులు మర్చిపోకుండా తవ్వి బయటకు తీస్తుంటాడు. అదొక్కటే వాడితో వచ్చిన తంటా అల్లా.

అప్పటికి వాడొచ్చి అరగంటయినా తమ్ముడ్ని చూసుకొని మా శ్రీమతికి సంబరం వదల్లేదు. ఫక్తు అరగంటూ వాడి యోగక్షేమాలడిగి తెలుసుకొంది. పావు గంటనుంచి దొడ్డిగుమ్మంలో అరుస్తున్న చాకలి సూరమ్మ కేకలు మా శ్రీమతి కర్ణపుటాలకి సోకితేగా! పాపం విసిగిపోయిందిలావుంది—ఆ బట్టలు తెచ్చి వీధి గుమ్మంలోపెట్టి "నోరు పడిపోయింది పిలవలేక, ఏం చేస్తున్నారమ్మా?" అంది చాకలిది.

"కనపడ్డం లేదుటే ముద్దుముఖమా! మాతమ్ముడొచ్చాడు, వాల్తేరులో ఆనర్స్ చదువుతున్నాడు. ఈ ఏతేదితో అయిపోతుంది, కాలేజీ లెక్చరర్ అయిపోతాడు" అంది మా శ్రీమతి (సొంతడబ్బా)

చాకలి సూరమ్మ ఓసారి సుందరంవదనారవిందం కేసి వర్ణనాతీతంగా చూసి పంటినిండా చెంగు తీసుకొంది. కాబోయే లెక్చరర్ వేషంలో ఇప్పటినుంచీ ట్రయినింగ్ అవుతున్న సుందరాన్ని చూస్తే చాకలి సూరమ్మకు కొంచెం సిగ్గుపడటం సబబుగా తోచింది.

"అప్పటినుంచీ ఇదేనా మీ చాకలిది!" అన్నాడు సుందరం వస్తూన్న నవ్వు ఆపుకుంటూ.

"ఆఁ! ఇదే వదిలించుకో లేకుండా వున్నాం" అంది శ్రీమతి నవ్వుతూ నావైపుచూస్తూ, అక్కాతమ్ముళ్లిద్దరూ నావైపుచూసి ఒకటే నవ్వటం. ఏమాట కామాటే చెప్పుకోవాలి నా ముఖం దమ్మిడీ కాసంతయింది. నేముందే చెప్పానాయిరి వీడు తిన్నగా వుండక పాతకాలపు స్మృతులు బయటికి తెస్తాడని. లేకపోతే ఎప్పటిసంగతి? అయిదేళ్ల క్రితం గొడవ! ఇప్పుడెందుకు చెప్పండి?

యర్రా మురళీకృష్ణమోహన్

